
ఉపాధికి ఆదరణ



- జిల్లాలో ఉపాధి హామీలో పెరుగుతున్న కూలీల సంఖ్య
- ప్రతిరోజూ 22,500ల మంది కూలీల హాజరు
- ఈ ఆర్థిక సంవత్సరానికి మిగిలిన పని దినాలు 4.12 లక్షలు
- ఆత్మీయ భరోసా పథకంతో ఉపాధి పనులపై ఆసక్తి
- ఆత్మీయ భరోసాకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ లింక్
- 20 రోజులు పని చేస్తేనే పథకం వర్తింపు
- మరోవైపు వ్యవసాయ పనులు పూర్తవడంతో ఉపాధి వైపు మొగ్గు
- జిల్లాలో 1.77లక్షల క్రియాశీలక జాబ్‌కార్డులు

కామారెడ్డి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల నుంచి వలసలు నివారించాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రారంభించింది. దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఆత్మీయ భరోసా పథకంతో కూలీలకు ఆర్థిక సహాయాన్ని ప్రకటించింది. దీంతో ఉపాధి హామీ పనులకు కూలీల నుంచి మరింత ఆదరణ లభిస్తోంది. అదేవిధంగా వ్యవసాయ పనులు సైతం ముగియడంతో గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలు ఉపాధి హామీ పనుల వైపు మొగ్గు చూపుతున్నారు. జిల్లాలో రోజురోజుకూ ఉపాధి హామీ పనుల కోసం కూలీల హాజరు సంఖ్య పెరుగుతుందని గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు చెబుతున్నారు. గత పక్షం రోజుల కిందట 7 వేలకు మాత్రమే పరిమితమైన కూలీల హాజరు సంఖ్య ప్రస్తుతం 22 వేలకు పైగా ఉపాధి హామీ పనులకు కూలీలు హాజరవుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 4.12లక్షల పని దినాలు కూలీలకు కల్పించాల్సి ఉంది. ఈ నెల చివరి కల్లా లక్ష్యాన్ని చేరుకుంటామని సంబంధిత శాఖాధికారులు చెబుతున్నారు.

జిల్లాలో రెండు లక్షలకు పైగా ఉపాధి కూలీలు

జిల్లాలోని 536 గ్రామ పంచాయతీల పరిధిలో సుమారు 2లక్షలకు పైగా ఉపాధి హామీ కూలీలు ఉన్నారు. క్రియా శీలకంగా ఉన్న జాబ్‌కార్డులు 1,77,519 కాగా వీటి పరిధిలో క్రియా శీలకంగా పనిచేసే ఉపాధి కూలీలు 2,90,107. ఉపాధి హామీ పథకం ద్వారా పలువురు కూలీలు స్వగ్రామంలోనే ఉపాధి పొందుతున్నారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతీ ఒక్కరికి వంద రోజుల పాటు పని కల్పించాలని ఈ పథకం లక్ష్యం. గ్రామాల్లో ప్రతీ ఏడాది ఫిబ్రవరి నుంచి జూన్ వరకు ఐదు నెలల పాటు ఉపాధి పనులు జోరుగా సాగుతుంటాయి. వేసవిలో వ్యవసాయ పనులు అంతగా లేకపోవడంతో కూలీలు ఉపాధి పనులపై ఆసక్తి చూపుతారు. వ్యవసాయ పనులు పూర్తవడంతో జిల్లాలో ప్రస్తుతం కూలీలంతా ఉపాధి హామీ పనులకు వెళ్తున్నారు. ఈనెల 1న 7,890 మంది కూలీలు ఉపాధి హామీ పనులకు హాజరు కాగా మంగళవారం 22,500ల మంది కూలీలు పనులకు హాజరవుతున్నారు.

20 రోజులు పని చేసిన వారికే ఆత్మీయ భరోసా

రాష్ట్ర ప్రభుత్వం భూమిలేని వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఈ పథకం ద్వారా కూలీలకు రూ.12వేల చొప్పున అందించాలని నిర్ణయించింది. ఈ పథకాన్ని గత జనవరి 26న అమలులోకి తీసుకువచ్చింది. మొదట ఎంపిక చేసిన 22 గ్రామాల్లోని 272 మంది కూలీలకు ఆత్మీయభరోసా ఆర్థిక సహాయాన్ని కూలీలకు అందించింది. అయితే 2023-24 ఆర్థిక సంవత్సరంలో 20 రోజుల పాటు ఉపాధిహామీ పనులకు హాజరై గుంట భూమి లేని వారిని ఈ పథకానికి అర్హులు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులకు ఆత్మీయ భరోసాను లింక్ చేసింది. ఉపాధి హామీ పనులకు హాజరయ్యే వారికే ఈ పథకాన్ని వర్తింపచేయడంతో 2025-26 ఆర్థిక సంవత్సరంలో కూలీల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. దీంతో ప్రస్తుతం జిల్లాలో ఉపాధి పనులకు కూలీలు ఎక్కువ సంఖ్యలోనే హాజరవుతున్నట్లు తెలుస్తోంది.

12 రకాల పనులతో కూలీలకు ఉపాధి

జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో కూలీలకు 38 లక్షల పని దినాలు కల్పించడమే లక్ష్యంతో 12 రకాల ఉపాధి పనులతో కూలీలకు ఉపాధి కల్పిస్తున్నారు. ఇప్పటికే 34 లక్షల పని దినాలు పూర్తిచేశారు. ఒక్కో కూలీకి రూ.197 రోజు వారి కూలి గిట్టుబాటు అవుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ మార్చి నాటికి మిగితా 4.12 లక్షల పని దినాలను కల్పించాల్సి ఉంది. ఉపాధి హామీ పథకం ద్వారా ప్రజలకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. రైతులు వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు రోడ్డు పనులను చేపడుతున్నారు. పల్లెవనాల విభాగం కింద వివిధ రకాల పండ్ల మొక్కలు పెంచడం వంటి వాటితో పశువులు, గొర్రెల షెడ్లు, ఫాం పాండ్, చేపల చెరువులు, వర్మీ కంపోస్టు, నాడేపు కంపోస్టు తయారీ ఊట కుంటల తవ్వకాలు, కందకాలు, ఇంకుడు గుంతలు, అంగన్‌వాడీ భవనాలు, పంచాయతీ భవనాలు, సీసీ రోడ్లు పలు రకాలతో ఉపాధి కులీలకు పని కల్పిస్తున్నారు.

ఆత్మీయ భరోసాకు తప్పని ఎదురు చూపులు

జిల్లాలో 22 మండలాల్లో పైలెట్ ప్రాజెక్ట్ కింద 22 గ్రామాలను ఆత్మీయ భరో సాకు ఎంపిక చేశారు. మొదటి విడతగా ఆయా గ్రామాల్లోని మొత్తం 272 మంది లబ్ధిదారులకు రూ.6వేల చొప్పున ఆత్మీయ భరోసా నిధులు కూలీల ఖాతాలో ప్రభుత్వం జమ చేసింది. మిగితా మంది భూమిలేని అర్హుల కూలీలకు వారి ఖాతాలో భరోసా నిధులు జమ కావాల్సి ఉంది. అయితే అర్హులైన కూలీలకు ఆత్మీయ భరోసా నిధుల కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. మరోపక్క ఈ పథకానికి సంబంధించి దరఖాస్తులు తీసుకున్న కూలీల్లో అనర్హులే అధికంగా ఉన్నారు. మిగితా వారు ఉపాధి హామీలో పని చేయని జాబ్‌కార్డులో లేని కూలీలే పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసుకోవడం గమనార్హం.

ప్రతిరోజూ 22 వేల మంది కూలీల హాజరు

• సురేందర్, డీఆర్‌డీవో పీడీ

జిల్లాలో ఉపాధి హామీ పనులకు ఇప్పుడిప్పుడే ఆదరణ వస్తోంది. వ్యవసాయ పనులు పూర్తవడంతో కూలీలు ఉపాధి హామీ పనుల వైపు మొగ్గు చూపుతు న్నారు. ప్రస్తుతం జిల్లాలో 22వేల 500ల మంది కూలీలు పనులకు హాజరవుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 4.12 లక్షల పని దినాలు కల్పించాల్సి ఉంది. మార్చి చివరి కల్లా లక్ష్యాన్ని పూర్తి చేస్తాం.



గిరిజనులతో కలిసి నృత్యం చేస్తున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్

ఘనంగా హోలి లెంగి ఉత్సవాలు

గాంధారి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): గాంధారి మండల కేంద్రంలో గిరిజనులు హోలి లెంగి ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగదాంబమాత, సేవలాల్ మహరాజ్ గుడి సమీపంలో బంజారా సాంప్రదాయ నృత్యమైన హోలి లెంగి కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు హాజరై గిరిజన సంప్రదాయ దుస్తులు ధరించి గిరిజనుల పాటలకు నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రి నుంచి 15 రోజులు పౌర్ణమి ఉపవాస దీక్షతో జరుపుకునే లెంగి పండుగలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, మండలంలోని గిరిజనులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వాహనాల వేలం పాట

కామారెడ్డి టౌన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి ఎక్సైజ్ పోలీసుస్టేషన్ పరిధిలో పట్టుబడిన వాహనాలను వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. స్టేషన్ పరిధిలో పట్టుబడిన 5 స్కూటర్లు, 1 ఆటో, 1 మారుతీకారు, మోటార్ కారును ఈనెల 17న ఎక్సైజ్ స్టేషన్ కార్యాలయం వద్ద వేలం పాట నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వాహనాలకు 18 శాతం జీఎస్టీ కూడా ఉంటుందని ఆసక్తిగల వారు రూ.5 వేలు డిపాజిట్ చేసి తమ పేరు నమోదు చేసుకోవాలని సీఐ తెలిపారు.

ఎల్‌ఆర్‌ఎస్ క్రమబద్ధీకరణను సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి టౌన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): అనధికార లేఅవుట్‌లు, వ్యక్తిగత ప్లాట్ల క్రమబద్ధీకరణను ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. మంగళవారం కామారెడ్డి మున్సిపాలిటీలో ఎల్‌ఆర్‌ఎస్ హెల్ప్‌లైన్ డెస్క్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేఅవుట్‌లు, ప్లాట్ల రెగ్యులరైజ్ చేసుకునేందుకు దరఖాస్తు చేసుకున్న వారికి ఫోన్ల ద్వారా సమాచారం అందించాలని తెలిపారు. మార్చి 31 వరకు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీ గురించి దరఖాస్తుదారులకు తెలిసే విధంగా ప్రచారం చేయాలన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఎల్‌ఆర్‌ఎస్‌పై ఏర్పాటు చేసిన కౌంటర్‌లను ఆయన పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతీ దరఖాస్తుదారునికి సమాచారం అందించి రాయితీ గురించి తెలియజేయాలని అన్నారు. ప్రతిరోజూ ఎల్‌ఆర్‌ఎస్‌పై సమీక్షించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌ను ఆదేశించారు. పట్టణంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలన్నారు. వేసవి కాలం దృష్ట్యా మొక్కలకు వాటరింగ్ నిర్వహించాలని, అవసరమైన ట్యాంకర్‌లను కొనుగోలు చేయాలని తెలిపారు. పార్కుల్లో చిన్నపిల్లలు ఆడుకునేందుకు జిమ్ వంటివి ఏర్పాటు చేయాలని తెలిపారు. వేసవి కాలం నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అద్దెపై బోరుబావులు గుర్తించాలని సూచించారు. అవసరమైన చోట్ల ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని అన్నారు. హరితహారం కింద నాటిన మొక్కలను సంరక్షించాలని తెలిపారు. పట్టణంలో అనధికారికంగా ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లను తొలగించాలని పర్మిషన్ ఉన్న హోర్డింగ్‌లపై ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకునేందుకు అనుమతించాలని తెలిపారు. డిమాండ్ మేరకు ప్రాపర్టీ ట్యాక్స్ వసూలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి, డీఈ వేణుగోపాల్, ఏఈ శంకర్, టీపీవో గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు ప్రవేశపెట్టాలి

కామారెడ్డి టౌన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సులను ప్రవేశపెట్టాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డికి సోమవారం విద్యాసేన నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కోత్మిర్‌కర్ వినయ్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఈ కోర్సులు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు ఇతర నగరాలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. దీంతో వారికి ఆర్థికభారం పెరుగుతుందని అన్నారు. వెంటనే ఈ కోర్సులను అందుబాటులోకి తీసుకురావాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పవన్, సురేష్, ప్రసాద్, రిషబ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు



భిక్కనూరు పోలీసుస్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ

విధుల పట్ల నిర్లక్ష్యంగా

వ్యవహరిస్తే చర్యలు తప్పవు

• జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర

భిక్కనూరు, మార్చి 11: విధుల పట్ల సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఎస్పీ శరత్‌చంద్ర అన్నారు. మంగళవారం భిక్కనూరు పోలీసుస్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ లోని రిసెప్షన్ కౌంటర్, ఎస్సై కార్యాలయాన్ని, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదుల పట్ల తక్షణమే స్పందించాలన్నారు. ఫిర్యాదు చేయడానికి వచ్చిన వారితో స్నేహ పూర్వకంగా మెలగాలన్నారు. ప్రతిరోజూ పెట్రోలింగ్‌ను క్రమం తప్పకుండా చేయాలన్నారు. మండలంలో దొంగతనాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉండేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకు ముందుగా భిక్కనూరు పోలీసుస్టేషన్‌కు తొలిసారిగా వచ్చిన ఎస్పీకి సీఐ సంపత్‌కుమార్, ఎస్సై ఆంజనేయులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. పోలీసుస్టేషన్ సిబ్బంది నుంచి గౌరవ వందనం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఖాళీగా ఉన్న వైద్యపోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

కామారెడ్డి టౌన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వైద్య విధాన పరిషత్ పరిధిలో ఖాళీగా ఉన్న వైద్యపోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని డీసీహెచ్‌ఎస్ విజయలక్ష్మీ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ఆసుపత్రి గైనిక్ వైద్యులు కామారెడ్డిలో రెండు బాన్సువాడలో 2, ఎల్లారెడ్డిలో 2, దోమకొండలో 1, మద్నూర్‌లో 1, అనస్తిషియా ఎల్లారెడ్డిలో 1, మద్నూర్‌లో 1, జనరల్ సర్జన్ మద్నూర్‌లో 01, పీడీయాట్రిక్ కామారెడ్డిలో 1, బాన్సువాడలో 2, ఆర్థోపెడిక్ కామారెడ్డిలో 1, రెడియాలజీ బాన్సువాడలో 1, జనరల్ మెడిసిన్ కామారెడ్డిలో 1, బాన్సువాడలో 1, ఎల్లారెడ్డిలో 1, ఈఎన్‌టీ కామారెడ్డిలో 1 ఖాళీగా ఉన్నాయని తెలిపారు. రూ.1లక్ష వేతనంగా అందించనున్నట్లు తెలిపారు. జనరల్ జీడీఎంవో కామారెడ్డిలో 1, బాన్సువాడలో 3, ఎల్లారెడ్డిలో 2 ఉన్నాయని వీటికి రూ.52,351 జీతం నెలనెల చెల్లిస్తారని తెలిపారు.



మరుపల్లి శివారులో మంజీరా నది నుంచి అక్రమంగా ఇసుక తీసుకు వెళుతున్న ట్రాక్టర్లను సీజ్ చేసిన పోలీసులు

జోరుగా ఇసుక అక్రమ రవాణా

- ఇసుక ట్రాక్టర్లు సీజ్ చేసిన పోలీసులు
- ఆ తర్వాత డంపుల వైపు చూడని రెవెన్యూ అధికారులు
- ఇసుక అక్రమ మాఫియాకు అధికారుల వత్తాసు

నిజాంసాగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ, పోలీసు అధికారుల ఆగడాలకు కళ్లెం వేసే నాథుడే లేడు. ఈ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అక్రమంగా ఇసుకను తరలించే వారిపై ముడుపులు దండుకుంటున్నారు. నిజాంసాగర్ మండల సమీపంలో మంజీరా నది, మంజీరా ఉప నదుల నుంచి పక్షం రోజులుగా అక్రమార్కులు ఇసుక రవాణా చేస్తున్నా రెవెన్యూ, పోలీసులు అధికార పార్టీ నేతలకు తొత్తులుగా మారి ఇసుక రవాణాకు వత్తాసు పలుకుతున్నారు. ప్రభుత్వ పథకాల పేరిట నిజాంసాగర్, అచ్చంపేట, ఆరేపల్లి, గున్కుల్, సింగం, కోమలంచ, గాలిపూర్, మగ్దుంపూర గ్రామాల వారధిగా ఉన్న మంజీరా నుంచి దర్జాగా ఇసుక తరలిస్తున్నా పోలీసులు రెవెన్యూ అధికారులు ముడుపులకు ఆశపడి ఇసుక అక్రమ మాఫియాలకు పలుకుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీ నేతలు మంజీరా వెంట ఉన్న గ్రామాలైన గున్కుల్, మాగి, బ్రాహ్మణపల్లి, మరిపల్లి, అచ్చంపేట, ఆరేపల్లి, కోమలంచ, సింగీతం, బంజపల్లి గ్రామాల పరిసర ప్రాంతాల్లో ఉన్న మంజీరా ఉప నదులు, వాగులు, వంకల నుంచి దర్జాగా అధికార పార్టీ నేతలు ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నా రెవెన్యూ అధికారులు ముడుపులకు ఆశపడి చర్యలు చేపట్టకపోవడం విశేషం. తాజాగా నిజాంసాగర్ మండలం అచ్చంపేట గ్రామ పంచాయతీ శివారు గ్రామమైన మర్పల్లి గ్రామ శివారులో మంజీరా ఉపనది నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తున్న అక్రమార్కులపై సోమవారం అర్ధరాత్రి పోలీసులు లాఠీ ఝులిపించారు. ఐదు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసి ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అక్రమ ఇసుక రవాణాపై కఠినంగా వ్యవహరిస్తున్నప్పటికీ రెవెన్యూ అధికారులు తమకు ఏమీ పట్టనట్లు వ్యవహరించడం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది. మర్పల్లి గ్రామంలో ఇసుక నిల్వలు రూ.లక్షల విలువ చేసేవి ఉన్నా రెవెన్యూ అధికారులు అధికార పార్టీ ప్రతినిధులతో కలిసిపోయి ఇసుక డంపులను సీజ్ చేయకపోవడం పట్ల స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నల్లవాగు మత్తడి, మంజీరా నుంచి తీసుకువెళ్లి ఇసుక రవాణాకు అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఎస్ఎస్ఆర్ పాఠశాలపై డీఈవోకు ఫిర్యాదు



డీఈవోకు ఫిర్యాదు చేస్తున్న నందిపేట ప్రైవేట్ పాఠశాలల యజమానులు

నందిపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఐదు చేతుల పోచమ్మ ఆలయ సమీపంలో నిర్మిస్తున్న ఎస్ఎస్ఆర్ పాఠశాలపై మంగళవారం జిల్లా ట్రస్మా అధ్యక్షుడు రాస నిత్యానందం ఆధ్వర్యంలో నందిపేట ప్రైవేట్ పాఠశాల యజమానులు జిల్లా విద్యాధికారి అశోక్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. నందిపేట నుంచి శాపూర్ వెళ్లే రోడ్డులో ఎస్ఎస్ఆర్ పాఠశాల భవనాన్ని నిర్మిస్తున్నారని, నిర్మాణం పూర్తి కాకుండానే వచ్చే సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లు, టీచర్ రిక్రూట్‌మెంట్లు నిబంధనలకు విరుద్ధంగా చేపట్టారని డీఈవోకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతే కాకుండా టీచింగ్ నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించారని, విద్యాహక్కును తుంగలో తొక్కారని తెలిపారు.ఈపాటికే అన్ని హంగులతో ఎస్ఎస్ ఆర్ భవన నిర్మాణాన్ని చేపట్టామని గ్రామాల్లో ప్రచారం మొదలు పెట్టారని పేర్కొన్నారు. నిబంధనలకు విద్ధంగా కార్యక్రమా లు చేపడుతున్న ఎస్ఎస్ ఆర్ పాఠశాలపై చట్టరీత్యా చర్యలు తీసు కోవా లని డీఈవో అశోక్ కుమార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ట్ర స్మా రాష్ట్ర సం యుక్త కార్యదర్శి రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోజూ రి అరుణ్, నందిపేట అధ్యక్షుడు చుక్కబొట్ల దేవన్న ఉన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి

ఆర్మూర్‌రూరల్, మార్చి11(ఆంధ్రజ్యోతి): బీసీ ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ నిధులతో సహా రెగ్యులర్ నిధులను వెం టనే విడుదల చేయాలని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి జీవీ.నర్సింహరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. గత ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు సుమారు రూ.4వేల కోట్లు పెండింగ్‌లో పెట్టిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినప్ప టికీ నిధులు మంజూరు చేయక పోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గతంలో అసెంబ్లీలో పెండింగ్, రెగ్యులర్ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేస్తామని సీఎం ప్రకటించారని, ఇంత వరకు చేయలేదని, వెంటనే నిధులు విడుదల చేయాలని ఆయన కోరారు.

మోర్తాడ్‌లో మహిళ అదృశ్యం

మోర్తాడ్, మార్చి11(ఆంధ్రజ్యోతి): మోర్తాడ్ మండల కేంద్రానికి చెందిన ఐనర్ల గంగు 52ఏళ్ల మహిళ కనిపించడంలేదని ఎస్సై విక్రం తెలిపారు. మున్నూరుకాపు కులానికి చెందిన ఐనర్ల గంగు గత 15 రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదని, ఆమె కొడుకు ఐనర్ల అశోక్ ఫిర్యాదు చేశారని ఎస్సై తెలిపారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసిదర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

ఎడపల్లి, మార్చి11(ఆంధ్రజ్యోతి):ఈ నెల9వ తేదీన జానకంపేట గ్రామం లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ టెస్టులో మద్యం తాగి వాహనం నడిపిన షేక్ అమీర్‌ను మంగళవారం స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్‌క్లాస్ న్యాయాధికారి ముందు హాజరు పరుచగా న్యాయాధికారి శేషతల్పసాయి రెండు రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పుని ఇచ్చారని ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. ఎవరైనా మద్యంతాగి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

క్యాంప్ డ్రైవ్‌లో ఆరుగురు విద్యార్థుల ఎంపిక



క్యాంపస్ సెలక్షన్‌లో ఎంపికైన విద్యార్థులు

మాక్లూర్, మార్చి11(ఆంధ్రజ్యోతి): మండలంలోని మానిక్‌భండార్ శివా రులో గల విజయ్ రూరల్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఎక్సలర్ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్లు కంపెనీ హెచ్‌ఆర్ శిల్ప, అవినాష్, అధికారికంగా ప్రకటించారు. కళాశాలకు చెందిన శ్రేయ, సంధ్య, గుఫ్రాన్, తరుణ్, హీర్షద్, సిద్ధార్థలు ఎంపిక కాగా కళాశాల ప్రిన్సిపాల్ అభినందనలు తెలుపుతూ వారు మరింత ముందుకు దూసుకువెళ్లాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందంలో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం పని చేయాలి



నందిపేటలో ప్రొసీడింగ్ కాపీలను అందజేస్తున్న వినయ్‌రెడ్డి

నందిపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతీ ఒక్కరు పని చేయాలని ఆర్మూర్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పొద్దుటూరి వినయ్ రెడ్డి కోరారు. మంగళవారం నందిపేట మండలంలోని సాయిబాబ గార్డెన్‌లో నందిపేట మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనుల నిర్మాణంకు మంజూరైన నిధుల ప్రొసీడింగ్ కాపీలను ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెంట ఇంద్రుడు, ఐలాపూర్ సొసైటీ చైర్మెన్ మీసాల సుదర్శన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్, ఆర్మూర్ నియోజక వర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బైండ్ల ప్రశాంత్, నాయకులు పిప్పెర సాయరెడ్డి, లోక హన్మాండ్లు, సిలిండర్ లింగం, గాదారి గోపి, దమ్మాయి శ్రీనివాస్, జి రాజేందర్, ఎడ్డిగారి నిఖిల్, ఇసూబ్, తదితరులు ఉన్నారు.

ఆర్మూర్‌రూరల్: ఆలూర్ మండలంలోని వివిధ గ్రామాలకు సంబంధించిన ఎస్‌డీఎఫ్, సీఆర్‌ఆర్ నిధుల ప్రొసీ డింగ్ కాపీలను పార్టీ నాయకులకు ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ పి.వినయ్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముక్కెర విజయ్, నాయకులు చిన్నయ్య, దేగాం శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలను పరిశీలించిన
శిక్షణ అసిస్టెంట్ కలెక్టర్

డొంకేశ్వర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): డొంకేశ్వర్ మండలంలోని నూత్‌పల్లి మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను మంగళవారం శిక్షణ అసిస్టెంట్ కలెక్టర్ సాకేత్‌కుమార్ సందర్శించారు. పాఠశాల నిర్వహణ విద్యాబోధన తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ప్రభుత్వం సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి పాఠశాలలో భోజనం చేశారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాస్, ప్రిన్సిపాల్ తదితరులు ఉన్నారు.

ఎల్ఆర్ఎస్‌పై అవగాహన

భీమ్‌గల్, మార్చి11(ఆంధ్రజ్యోతి): భీమ్‌గల్ పట్టణ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గోపు గంగాధర్ ఆధ్వర్యంలో మంగళవారం ప్లాట్ల యాజమానులకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ముగ్గురు ఎల్ఆర్ఎస్‌ను చెల్లించారు. ఈ కార్యక్రమంలో ప్లాట్ల యాజమానులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి కాళ్లకు సంకెళ్లు

- స్టేషన్‌ను చీపురుతో ఊడిపించిన వైనం
- బోధన్ పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకున్న ఘటన



బేడీలతో ఉన్న నిందితుడు చీపురుతో స్టేషన్‌ను ఊడుస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,మార్చి11(ఆంధ్రజ్యోతి): ఫ్రెండ్లీ పోలీసులుగా ఉండాల్సిన పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్న తీరు బోధన్‌లో చోటు చేసుకుంది. చోరీ కేసులో కాళ్లకు సంకెళ్లతో ఉన్న వ్యక్తితో చీపురుతో స్టేషన్‌ను ఊడిపించిన ఘటనతో పోలీసుల తీరు వివాదాస్పదమైంది. ద్విచక్ర వాహనాల చోరీ కేసులో నిందితుడి కాళ్లకు సంకెళ్ల వేసి స్టేషన్‌ను చీపురుతో ఊడిపించిన వైనం మంగళవారం ఉదయం బోధన్ పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. అక్కడే విధి నిర్వహణలో ఉన్న హెడ్ కానిస్టేబుల్ నిందితుడిని చీపురుతో ఊడిపించాడని సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో ప్రజాసంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు కూడా ఘటనపై విచారణ చేపడుతున్నారు. ద్విచక్ర వాహనం చోరీ కేసులో బోధన్ మండలంలోని బెల్లాల్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని సోమవారం విచారణ కొరకు పోలీసులు స్టేషన్‌కు తీసుకువచ్చారు. ద్విచక్ర వాహనాలు చోరీ ఒప్పుకోవడంతో సోమవారం రాత్రి పారిపోతాడేమోనని చెప్పి కాళ్లకు బేడీలు వేశారు. మంగళవారం ఉదయం నిద్ర లేచిన నిందితుడిని అక్కడ పరిసరాలను పరిశుభ్రం చేయాలని అక్కడే ఉన్న పోలీసులు ఆదేశించారు. దీంతో చీపురు పట్టుకుని కాళ్లకు బేడీలు ఉన్న నిందితుడు ఊడుస్తున్నాడు. ఉదయం పూట స్టేషన్‌కు వెళ్లి ప్రజలు సంకెళ్లతో ఉన్న వ్యక్తి ఊడిచే వీడియోలను వివిధ గ్రూపుల్లో వైరల్ చేశారు. దీంతో ఈ ఘటన వివాదానికి తెర లేపింది. ఫ్రెండ్లీగా ఉండాల్సిన పోలీసులు ఇలా చేయడం సరికాదని, బేడీలతో ఉన్న నిందితులతో పనులు చేయించడం ఏమిటని ప్రజా సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. స్టేషన్‌కు వచ్చే వారితో స్నేహబంధంగా ఉండాలే కాని ఇలా పనులు చేయించడం ఏమిటని పేర్కొంటున్నారు.

- ఘటనపై పూర్తి విచారణ చేపడుతున్నాం: బోధన్ ఏసీపీ శ్రీనివాస్

మంగళవారం ఉదయం బోధన్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన ఘటనపై సమగ్ర విచారణ చేపడుతున్నామన్నారు. అక్కడ సీసీ కెమెరా ఉందని దీని వల్ల ఎవరి తప్పిదమో తేలిపోతే పోలీసులు అయిన సరే వారిపై చట్టరీత్యా చర్యలు చేపడతామన్నారు. అక్కడ విధుల్లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ నిందితుడికి పనులు చేయాలని చెప్పడం జరిగిందని కొందరు, అతనే నిద్ర లేచి పడుకున్న ప్రదేశాన్ని పరిశుభ్రం చేసుకుంటున్నాడని మరికొందరు ఇలా రెండు వాదనలు తమ దృష్టికి వచ్చాయన్నారు. ఏదీ ఏమైనా సీసీ ఫుటేజీల ద్వారా పూర్తి విచారణ చేపడుతున్నామన్నారు. సీసీ ఫుటేజీల ద్వారా అన్ని కోణాల్లో విచారణ చేపడతామన్నారు. పోలీసుల తప్పిదం అయితే పోలీసులు అని చూడకుండా వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు. పోలీసులు స్టేషన్‌కు వచ్చే ప్రజలతో స్నేహపూర్వకంగా ఉండాలని పేర్కొన్నారు. నిందితులతో పనులు చేయించడం సరికాదని దీనిపై పూర్తి విచారణ చేపట్టి త్వరలోనే ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

కోటగిరి,మార్చి11(ఆంధ్రజ్యోతి): కోటగిరి జిల్లా పరిషత్ పాఠశాలలో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు పొద్దుటూరి మోహన్ రెడ్డి హాజరై మహిళ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా మహిళలు అన్ని రంగాలలో రాణించడం హర్షించదగ్గ విషయమన్నారు. మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాలలో రాణిస్తున్నారని, వారిని గౌరవించడం మన విధి అని పేర్కొన్నారు. ఎక్కడైతే మహిళలు గౌరవించబడతారో అక్కడ అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్, ఎంఈవో శ్రీనివాస్ రావు, ప్రధానోపాధ్యాయురాలు అలివేలు, పీఆర్‌టీయూ నాయకులు బర్ల సాయిలు, ఉదయ్ చందర్, గంగారాజు, సుధీర్, నరేష్, అర్షద్ హుస్సేన్, రవీందర్, కృష్ణ మోహన్, సుమన సుచిత్రవాణి, ఎండీ పాషా, రాజు తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: మండల కేంద్రంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎంఈవో అశోక్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కిషన్, మండల అధ్యక్షులు భూమయ్య, ప్రధాన కార్యదర్శి శివకుమార్, పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షురాలు రాధ, పెద్ద ఎత్తున మహిళ ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.



అంక్సాపూర్‌లో మహిళ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

వేల్పూర్: వేల్పూర్ మండలం అంక్సాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పాఠశాల హెచ్‌ఎం మల్లిశ్వరీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మాదరి అన్నపూర్ణ స్మారక ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.రాజన్న ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మల్లిశ్వరీ, ఉపాధ్యాయులు రవిచందర్, సునీత, రఘునాథ్, శ్రీదేశి, శ్రీలక్ష్మీ, కాంతయ్య, రాజేందర్, దామోదర్‌గౌడ్, యమున, దేవరాజ్, వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి



పొతంగల్‌లో కొనసాగుతున్న నిరసన దీక్ష

కోటగిరి,మార్చి11(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి పోచీరాం డిమాండ్ చేశారు. పొతంగల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తలపెట్టిన నిరవధిక నిరసన దీక్ష మంగళవారంతో 3వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పోచీరాం మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను తక్షణమే అమలు చేస్తే 59ఉప కులాలకు న్యాయం జరుగుతుందన్నారు. మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు రెండు మంత్రి పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే వరకు దీక్షలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు యాదవరావు, సాయిలు, సంజీవ్, నర్సింలు, మస్నాజీ, భూమయ్య, దత్తు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం రెండవ రోజు రిలే నిరహర దీక్ష కొనసాగుతుంది. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జీ మైలారం బాలు మాట్లాడుతూ అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలకు ఇచ్చిన హామీని మరిచి గ్రూప్ -1 ఫలితాలను విడుదల చేయడం సుప్రీం కోర్టు ఎస్సీ రిజర్వేషన్‌కు అనుగుణంగా తీర్పు వచ్చిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి ఉద్యోగ నియమకాలు చేపట్టడం మాదిగల పట్ల కక్ష్యపూరితంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మైలారం రాము, నూత్‌పల్లి సంతోష్, మంగ్లారం రవి, ఇందిరపు రాజు, మంద సంజీవ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

మోస్రా: చందూర్ మండలకేంద్రంలో మంగళవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఎస్సీరిజర్వేషన్ వర్గీకరణ చట్టం వచ్చేంత వరకు అన్ని ఉద్యోగ పరీక్షలను ఫలితాలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిరవధిక నిరసన దీక్షలు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎంపీ అర్వింద్ చేసిన అభివృద్ధి ఏమిటి?

- ప్రశ్నించిన కాంగ్రెస్ నాయకులు

బోధన్‌రూరల్,మార్చి11(ఆంధ్రజ్యోతి): బోధన్ నియోజకవర్గంలో ఎంపీ ధర్మపురి అరవింద్ ఒక్క అభివృద్ధి పని అయిన చేశాడా అని టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రశ్నించారు. మంగళవారం బోధన్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం నిధులతో ఫ్లైఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేస్తామని శిలాఫలకం చేసి సంవత్సరం గడిచిన ఇప్పటి వరకు బ్రిడ్జి పనులు ప్రారంభం కాలేదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పాషా మొయినోద్దీన్, మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావు, ఆదినారాయణ, హరికాంత్ చారి, అంకు దామోదర్ రెడ్డి, రాములు, తలారినవీన్, చిరంజీవి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

టీటీపేట,మార్చి 11(ఆంధ్రజ్యోతి): టీటీపేట మండలంలోని శివారురాంరెడ్డిపల్లి గ్రామంలో ప్రత్యేక ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతంగా నిర్మించాలని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి పూర్ణచంద్రోదయకుమార్, ఎంపీఓ అబ్బాగౌడ్, గ్రామాల కార్యదర్శులురమేష్, వెంకటస్వామి,మాజీ సర్పంచ్‌ప్రభాకర్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో లోపం లేకుండా చూడాలి

బోధన్‌రూరల్,మార్చి11(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి లోపం లేకుండా చూడాలని సీజీఆర్‌ఎస్ చైర్మన్ ఈ.నారాయణ అన్నారు. మంగళవారం బోధన్ పట్టణ శివారులోని బెల్లాల్ సబ్ స్టేషన్‌లో వినియోగదారుల ఫిర్యాదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డీఈ ముక్తార్ హైమద్, రామకృష్ణ, కిషన్, రాజాగౌడ్, నాయిని కృష్ణ, శివాజీ, గణేష్, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లక్కోరలో ఒకరి అదృశ్యం

వేల్పూర్, మార్చి11(ఆంధ్రజ్యోతి): లక్కోర గ్రామానికి చెందిన గడ్డం నరేష్ వ్యక్తి సోమవారం మధ్యాహ్నం నుంచి తప్పిపో యినట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు. గడ్డం నరేష్ టిఫిన్ సెంటర్ నడిపించు కుంటున్నాడని, సోమవారం ఉదయం 10గంటల సమయంలో టిఫిన్ సెంటర్‌లో భార్యతో ఉండగా దోశ ఆడర్ వచ్చిందని చెప్పి డెలివరీ చేయడానికి తన బైక్‌పై గడ్డం నరేష్ వెళ్లాడు. మధ్యాహ్నం 1గంట అయిన ఇంటికి రాక పోవడంతో నరేష్ ఫోన్ స్విచ్ వచ్చిందని, తమ బంధువుల ఇంటికి వెళ్లివెతికిన ఆచూకీ లభించలేదని భార్య తెలిపింది.మంగళవారం భార్య లాస్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చోరీ కేసులో దొంగ అరెస్టు

నందిపేట,మార్చి 11(ఆంధ్రజ్యోతి):నందిపేట మండలంలోని వెల్మల్ గ్రా మంలో ఇటీవల దొంగతనం జరిగిన కేసుకు సంబంధించి ఎడపల్లి మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన సుంకరి శ్రీనివాస్ అనే దొంగను మంగళ వారం అరెస్టు చేసి కోర్టుకు పంపినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. ఈ నెల 7వ తేదీనా వెల్మల్ గ్రామంలోని కుస్తాపురం శ్రీనివాస్ ఇంట్లో దొంగ త నం జరిగింది. ఆ కేసులో ఏ-2గా ఉన్న సుంకరి శ్రీనివాస్‌ను అరెస్టు చేసి ఆయ న నుంచి 100 గ్రాముల వెండి పట్టా గొలుసులు రికవరీ చేసినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

టోర్నీ విజేతగా బాబాపూర్ జట్టు

భీమ్‌గల్‌రూరల్ మార్చి11(ఆంధ్రజ్యోతి): మండలంలో పురాణిపేట్ గ్రామంలో గత 15రోజులు నుంచి నిర్వహిస్తున్న కీర్తిశేషులు బోల్లాపల్లి రాజాగౌడ్ స్మారక క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్‌లో పురాణిపేట్, బాబాపూర్ జట్లు తలపడగా బాబాపూర్ జట్టు విజయం సాధించింది. అనంతరం విజేతలకు ట్రోఫీలతో పాటు ప్రైజ్‌మనీని టోర్నీనిర్వాహకులు చరణ్, అజయ్, గ్రామస్థులు అందించారు.

రెండు గ్రామాల మధ్య వివాదంపై చట్టపరంగా న్యాయం చేస్తాం

- జిల్లా అధికారి ఆంజనేయులు స్వామి



ప్రజలకు హెచ్చరిక చదివి వినిపిస్తున్న అధికారులు

మోస్రా,మార్చి11(ఆంధ్రజ్యోతి): చందూర్ మండలంలోని లక్ష్మీసాగర్ తండ, లక్మాపూర్ గ్రామాల మధ్య చెరువు నీటి విషయంపై ఇరు గ్రామాల మధ్య సోమవారం రాత్రి గొడవ జరగగా పోలీసులు వచ్చి ఇరు వర్గాలను శాంతిపర్చారు. మంగళవారం ఉదయం సంబంధిత అధికారులతో మాట్లాడుకోవాలని గొడవలతో సమస్యలు పరిష్కారం కావని సూచించారు. మంగళవారం మధ్యాహ్నం సమయంలో బాన్సువాడ, నిజామాబాద్ ప్రధాన రహదారిపై లక్మాపూర్ గ్రామస్థులు ధర్నా నిర్వహించారు. మా నీళ్లు మాకు ఇవ్వాలని నినాదాలు చేశారు. వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోగా ఏసీపీ శ్రీనివాస్ పోలీసు సిబ్బంది వచ్చి ధర్నా చేయడం ఇంతటి ఎండలో జనాలకు ఇబ్బంది పెట్టడం సరికాదని, చెరువు వద్దకే వెళ్లి సమస్య పరిశీలన చేసి పరిష్కారం చేద్దామని వెళ్లగా అక్కడికి చేరుకున్న జిల్లా మత్స్యశాఖ అధికారి ఇరు. గ్రామాల ప్రజలతో మాట్లాడుతూ ఈ చెరువు మీ గ్రామానికి చట్టం ప్రకారం నమోదు చేసుకోలేరు గతంలో ఈ చెరువు మోస్రా మండలంలోని తిమ్మాపూర్ గ్రామం వారు చట్టం ప్రకారం నమోదు చేసుకుని చేపలు పెంచి వ్యాపారం చేసుకుంటున్నారు. ఇప్పుడు మీ రెండు గ్రామాలు వచ్చి మాకు వాటా ఉందంటూ గొడవలు చేయవద్దు మీ సమస్య పరిష్కారం నిమిత్తం జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేస్తామని సూచించారు. ఇప్పుడు ఈ చేపలను పట్టి వేలం వేసి వచ్చిన నగదు మొత్తం మండల శాఖ ఖాతాలో జమ చేసి సమస్య పరిష్కారం అనంతరం ఎవరి వాటా వారికి ఇస్తామని తెలిపారు. ఇంతలోనే జాలర్లు చేపలు పట్టుకుని ఒడ్డుకు తెచ్చిన వెంటనే ఒకేసారి అందరు చేపల వద్దకు చేరుకుని అధికారి మాటలు ధిక్కరించి చేపలు ఎత్తుకుపోయారు. మరికొన్ని చేపలు తెస్తుండగా పోలీసులు అప్రమత్తమై అందరిని చెదరగొట్టి ఒక్కొక్క చేపల మూటను వేలం వేశారు. జరిగిన పరిణామాలను ఖండిస్తూ ఇది గ్రామ ప్రజల గౌరవం పోగొట్టుకున్నట్లు చేస్తున్నారు. చేపలు లూటీ చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామని జిల్లా మత్స్యశాఖ అధికారి ఆంజనేయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఏసీపీ శ్రీనివాస్, తహసీల్దార్ శాంత, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఇరు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి

ఎడపల్లి, మార్చి11(ఆంధ్రజ్యోతి): ఎడపల్లి మండలంలోని అంబం గ్రామానికి చెందిన కోతల ఒడ్డెన్న(49) అనే వ్యక్తి గ్రామ సమీపంలో ఉన్న పెద్దవాగులో మంగళవారం ఉదయం చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు వాగులో పడి మరణించాడని, మృతుని కుమారుడు కోతల రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు.

సమ్మక్క సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్‌గా బోధన్ వాసి



వైల్ శ్రీనివాస్

బోధన్‌రూరల్,మార్చి11(ఆంధ్రజ్యోతి): సమ్మక్క, సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ మొదటి వైస్ చాన్సలర్‌గా బోధన్ పట్టణం శక్కర్‌నగర్‌కు చెందిన వైఎల్ శ్రీనివాస్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బోధన్ పట్టణానికి చెందిన వైఎల్ శ్రీనివాస్ విధినిర్వహణలో అంకిత భావంతో పని చేయడంతో ప్రభుత్వం గుర్తించి తనకు పదవి లభించిదని పట్టణ ప్రముఖులు ఈ సందర్భంగా ఆయనను అభినందిస్తున్నారు.

కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



బాన్సువాడలో చెక్కులను పంపిణీ చేస్తున్న ప్రభుత్వ సలహాదారులు పోచారం

బాన్సువాడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ పట్టణ కేంద్రంలోని తన ని వాసం వద్ద మంగళవారం వర్ని, చందూర్, కోటగిరి మండలాలకు చెందిన 82 లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను ప్రభుత్వ సలహాదారులు పో చారం శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కోటగిరి మండల మార్కెట్ కమిటీ అధ్యక్షులు గైక్వాడ్ హన్మంతు, కోటగిరి మండల మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు అనిల్, వర్ని, చందూర్, కోటగిరి మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచితంగా పరీక్షల ప్యాడ్ల పంపిణీ

నందిపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మంగళవారం1989-90 ఎస్ఎస్‌సీ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు పరీక్షల ప్యాడ్లు ఉచితంగా పంపిణీ చేశారు. అంతే కాకుండా పెన్నులు, పెన్సిల్‌లు, రబ్బర్లు అందజేశారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త ఏర్రం సిలిండర్ లింగం మాట్లాడుతూ విద్యలో ఉత్తమ ప్రతిభను కనబర్చే విద్యార్థులకు నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజుల, 1989-90 ఎస్ఎస్‌సీ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు సాయిరాం,సుధాకర్, హన్మాండ్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు

ధ్యానంతో మానసిక ప్రశాంతత

భీమ్‌గల్‌రూరల్ మార్చి11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రతీరోజు యోగా, ధ్యానం చేయడం ద్వారా మానసిక ప్రశాంతత పెరగడంతో పాటు జ్ఞాపకశక్తి పెరిగి మంచి మార్కులు పొందవచ్చునని యోగా గురుజీ పర్స అనంత్‌రావు తెలిపారు. మంగళవారం మండలంలోని దేవక్కపేట్ గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు యోగా కమిటీ బృందం పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యోగ కమిటీ సభ్యులు శివకుమార్, నవీన్, రాకేష్, బాపురావు, పురస్తు లింబాద్రి, పాఠశాల హెచ్‌ఎం చిన్న రాజమణి, రేఖ, మోహన్, వీడీసీసభ్యులు అజయ్, సేవలాల్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలి



ఏర్గట్లలో ఇంటి పన్నులు వసూలు చేస్తున్న జీపి సిబ్బంది

ఏర్గట్ల, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జరుగుతు న్న ఇంటి పన్నులు దుకాణాల లైసెన్స్‌లను మంగళవారం ఆర్మూర్ డీఎల్‌పీవో శివకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఈ నెల 25లోపు వందశాతం పన్నులు చెల్లిచాలని సిబ్బం దికి సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి జాకీర్ హుస్సేన్, కారో బార్ సా యన్న, జీపి సిబ్బంది పాల్గొన్నారు.

భీమ్‌గల్‌రూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు ఇంటి పన్నులు సకాలంలో చెల్లించి అభివృద్ధికి సహకరించాలని ఎంపీవో జావీద్‌అలీ కోరారు. మంగళవారం బాబాపూర్ గ్రామంలో ఎండ తీవ్రత ఎక్కువ కారణంతో ప్రజలు తాగునీటి ఇబ్బందులు కలుగకుం డా చూడాలని కార్యదర్శి రమ్యకు ఆయన సూచించారు.గ్రామపంచాయతీలో రికార్డులను ఆయన పరిశీలించి పారిశుధ్య పనులకు ఖర్చు చేసిన వివరాలను అడిగితెలుసుకున్నారు.

బోధన్‌రూరల్: ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని బోధన్ మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ అన్నారు. మంగళవారం పట్టణ గౌడ సంఘం, పాన్‌గల్లీ వారి వద్ద నుండి 2,68,768రూపాయల పన్నులను వసూలు చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులున్నారు.

మిట్టాపూర్‌లో చిరుత సంచారం

నవీపేట,మార్చి11(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టాపూర్ శివారులో చిరుత పులి సంచరిస్తుందని స్థానికులు తెలిపారు. మంగళవారం ఉదయం పొలం పనులకు వెళ్లిన పలువురు రైతులకు చిరుత పులితో పాటు రెండు చిరుత కూనలు తిరుగుతూ వారికి కనిపించాయని స్థానికులు పేర్కొన్నారు. చిరుత పులిని చూసిన వారు భయంతో గ్రామంలోకి వచ్చారని వారు వివరించారు. ఈ విషయాన్ని అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు స్థానికులు పేర్కొన్నారు. గ్రామ శివారులో చిరుత పులి సంచరించడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కార్యశాల

ఆర్మూర్‌టౌన్,మార్చి11(ఆంధ్రజ్యోతి):పట్టణంలో ప్రభుత్వ డిగ్రీకళాశా లలో వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో మంగళవారం జీఎస్టీ అంశంపై ఒక రోజు కార్యశాల నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుప్రసాద్ తెలిపారు.ఈ కార్యక్రమంలో వర్ష కోఆర్డినేటర్ జి.లింగన్న, కన్వీనర్ రాజ్ కుమార్, యు.మనోహర్, వైస్‌ప్రిన్సిపాల్ ఎం.సునీత, ఎన్.అంబర్‌సింగ్, జాన్ సుకుమార్, రహమన్, శ్యామ్‌కుమార్, వజీరబేగం, తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డి కేజీబీవీ తనిఖీ

రామారెడ్డి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలో మీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండల కేంద్రంలో ప్రభుత్వం కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలను/హాస్టల్‌ను మంగళవారం మండల ప్రత్యేక అధికారి డాక్టర్ సంజయ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎల్లేటి తిరుపతిరెడ్డి, కస్తూర్బా హాస్టల్ ప్రిన్సిపాల్ వనిత, పశువైద్యాధికారి రామచందర్ నాయక్, పంచాయతీ కార్యదర్శి క్రాంతి కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

బోనాల్‌లో ఎల్లమ్మకు ఘనంగా బోనాలు

లింగంపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : లింగంపేట మండలంలోని బోనాల్‌లో మంగళవారం ఎల్లమ్మకు ఘనంగా బోనాలను సమర్పించారు. గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి ప్రతీ ఇంటి నుంచి బోనాలను తీసుకువెళ్లి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామాన్ని చల్లగా చూడమని అమ్మవారిని ప్రార్థించారు. పల్గొన్నారు:' పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

తాడ్వాయి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తాడ్వాయి మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేసినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జూకంటి వెంకట్‌రెడ్డి తెలిపారు.ఇందులో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అంబీర్, శ్యామ్‌రావు, మాజీ సర్పంచ్ బండారి సంజీవులు వీడీసీ చైర్మన్ మేకల రాజు, గ్రామ అధ్యక్షుడు మెట్టు చంద్రం, యూత్ ప్రెసిడెంట్ గుటగాడి రంజిత్‌రెడ్డి, ఈరా మొల్ల నర్సింలు, ఎరవటి శ్రీకాంత్, కాంగ్రెస్ కార్యకర్తలు, సీనియర్ నాయకులు తదితరులు ఉన్నారు.

ప్రణాళికతో చదివితే..

పదిలో ఉత్తమ ఫలితాలు

ఆర్మూర్‌రూరల్, మార్చి11 (ఆంధ్రజ్యోతి): మరో తొమ్మిది రోజుల్లో పదో తరగతి పరీక్షలు ప్రారంభంకానున్నాయి. ఈ చివరి సమయం విద్యార్థులకు ఎంతో ముఖ్యమైనవని, ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు రాబట్టవచ్చని ఉపాధ్యాయులు చెప్తున్నారు. పదో తరగతి పరీక్షలు ఈనెల 21 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రణాళికతో చదవాలని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్‌కు పదో తరగతి తొలిమెట్టు. ఇక్కడి నుంచే పిల్లల తల్లిదండ్రుల భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. పదవ తరగతిలో సాధించే మార్కుల ఆధారంగా విద్యార్థుల భవిష్యత్‌పై ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఈ పరిస్థితిని సులువుగా దాటలంటే పాఠ్యాంశాలపై పూర్తిఅవగాహన కలిగి ఉండడం ఉత్తమమని, సబ్జెక్టుల వారీగా ఏయే అంశాలలో ప్రాధాన్యత ఇవ్వాలి ప్రణాళికలను ఎలా సిద్ధం చేసుకోవాలో ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. విద్యార్థులకు పదవ తరగతిలో మంచి మార్కులు వచ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది.



విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేస్తున్న ఉపాధ్యాయులు

ఆంగ్లం సబ్జెక్టుపై భయాన్ని వీడాలి

విద్యార్థులు ఇంగ్లీష్ సబ్జెక్టుపై ఉన్న భయాన్ని వీడాలి. ప్రతీ పాఠ్యాంశాన్ని క్లుప్తంగా చదువుకుంటే చాలాసులువుగా మార్పులు సాధించవచ్చని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. కంప్రహెన్సన్ సంబంధించి మూడు మార్కులు ఉంటాయి. వీటిపై అవగాహన కలిగి ఉంటే సులభమే. క్రియేటివ్, ఎక్స్‌ప్లెషన్‌కు 20 మార్కులు ఉంటాయి. లెటర్ రైటింగ్, సంబాషణలు, జీవిత చరిత్రలపై అవగాహన సంబంధించిన ప్రశ్నలు ఉంటాయి. మూడవ భాగంలో వ్యాఖరణం, పాఠ్యపుస్తకం చివరలో ఎక్సైజ్ అధారంగా ఎక్కువ ప్రశ్నాలు ఉంటాయి. పట్టుసాధిస్తే మార్కులు సాధిస్తారు. విషయ అన్ని అర్థం చేసుకొని చదివితే వందశాతం సాధించేందుకు వీలుంటుంది.

పతీ అంశంపై సాధన చేయాలి

భౌతికశాస్త్రంలో ప్రతీ అంశంపై విద్యార్థులు సాధన చేయాలి. రసాయన సమీకరణ పరమాణుల నిర్మాణం, మూలకల వర్గీకరణ, రసాయ బంధం అంశాలపై నాలుగు మార్కుల ప్రశ్నాలు ఎక్కువగా ఉంటాయి. క్రాంతికి సంబంధించి చిత్రలపై సాధన చేయాలి. విద్యుత్, కార్బన్ పాఠ్యంశాలపై రెండు మార్కుల ప్రశ్నలు ఉంటాయి. అందులోని పదాలను క్లుప్తంగా తెలుసుకోవడంతో బిట్లు ఎక్కువగా పూరించవచ్చు. ప్రయోగాలపై ముడిపెట్టి ప్రశ్నాలు ఉంటాయి. ప్రతీపాఠం వెనుక నేర్చుకున్న విషయంపై ఉన్న బిట్లను సాధన చేయాలని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు.

చివరి బీట్‌లపై సాధన చేయాలి

● జగదీశ్వర్, గణిత ఉపాధ్యాయులు, ఇస్సాపల్లి



గణితం మొదటి పేపర్‌లో వాస్తవ సంఖ్యలు, సమితులు, బహువదులు, సంఖ్యకశాస్త్రం, విరుపక రూపక రేఖగణితం పాఠ్యంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి. ముఖ్య పాఠ్యంశాలను కంఠస్తం చేస్తే అధిక మార్కులు సాధించవచ్చు. పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా సిద్ధం కావాలి. గతంలో వచ్చిన ప్రశ్నాపత్రాలను గమనించాలి. అభ్యాసక దీపికను చదువుకుంటే మల్టిపుల్ చాయిస్‌లో ఎక్కువ మార్కులు సాధించవచ్చు. పరీక్షల్లో నేరుగా ప్రశ్నలు ఇవ్వకుండా మార్చిమార్చి ఇస్తారు. ఇష్టంగా లెక్కలు సాధన చేయడం వల్ల సోపన క్రమాన్ని అవగాహన చేసుకోవాలి. పాఠ్యంశం చివరన ఉన్న బిట్లపై పట్టుసాధిస్తే ఉత్తమ ఫలితాలు పొందవచ్చు.

చార్టు, బార్ గ్రాప్‌లపై దృష్టి సారించాలి

● కిషన్‌రెడ్డి, సాంఘీకశాస్త్ర ఉపాధ్యాయులు



సాంఘీకశాస్త్రంలో భారత భౌగోళిక స్వరూపాలు, నీటి వనరులు, ఉత్పత్తులు, నదులు, గ్రామ ఆర్థిక వ్యవస్థ, ఉపాధి, ఆహార భద్రత, ప్రపంచీకరణపై ప్రశ్నలు వస్తాయి. విద్యార్థులు చార్ట్, బార్ గ్రాప్‌లపై దృష్టిసారించాలి. చిత్రపటాలకు మార్కులు ఉంటాయి. నదులు, పర్వత శిఖరాలు, ప్రాజెక్టులు, పీట భూముల హద్దులను గుర్తించాల్సి ఉంటుంది. ప్రశ్నలకు జవాబులను విశ్లేశించి రాయాలి. పాఠ్యపుస్తకంలోని ప్రతీపాఠంలో ముఖ్యమైన అంశాలను అండర్‌లైన్ చేసుకోవాలి. మ్యాప్‌లో మహాసముద్రాలు, పర్వతాలు ముఖ్యదేశాల ప్రపంచ యుద్ధాలలో పాల్గొన్న దేశాల అంశాలపై అవగాహన ఉండాలి. ప్రశ్నలు పరోక్షంగా ఉంటాయి. చదివితే మార్కులు సాధించవచ్చు.

అన్నిఅంశాలపై అవగాహన పెంచుకోవాలి

● జిందం నరహరి, విశ్రాంత ఉపాధ్యాయుడు



జీవశాస్త్రంపై అవగాహన పెంచుకుంటే మంచి మార్కులు సాధించవచ్చు. మొదటి అంశం పోషనలో కిరణజన్య సంయోగక్రియా, శ్వాసక్రియలలో ఎక్కువ 4 మార్కులు వస్తుంటాయి. పోషకాహారలోపంతో వచ్చే వ్యాధులు విటమిన్‌లపై నాలుగు మార్కులు ప్రశ్నాలు ఉంటాయి. మైటోకండ్రియ విత్తనాలు, ఎలా శ్వాసక్రియ జరుపుతాయన్న ప్రతీ అంశాలు కూడా కీలకమే. ప్రసరణ పాఠ్యంశం నుంచి బ్లడ్ గ్రూప్‌లపై దృష్టి సారించాలి. జీవక్రియలో సమన్వయం, జీర్ణ మండలాన్ని మానవ శరీరంలో రెండో మెదడుగా ఎందుకు పరిగణిస్తారు. మెండల్ ప్రయోగాలు, పర్యావరణవనరులు, వ్యవసాయ పద్ధతులపై బాగా చదవాలి.


తెలుసుకుందాం!!



ఉపాధి పనులను చేస్తున్న కూలీలు

అరచేతిలో ఈజీఎస్ సమాచారం

మద్నూర్, మార్చి11 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో పారదర్శకతను పెంచేలా కేంద్ర ప్రభుత్వం నూతన యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఉపాధిహామీ కూలీలకు అందుబాటులో ఉండేదా దీనిని రూపొందించారు. ఈ చట్టంలో ఎలాంటి అవకతవకలు లేకుండా పూర్తిగా పారదర్శకత ఉండేలా యాప్‌ను ఏర్పాటు చేశారు. జన్‌మన్ నరేగా పేరుతో వచ్చిన ఈ కొత్త యాప్ కూలీలకు సులభంగా సమాచారం అందేలా తీర్చిదిద్దారు. కూలీలు చేసిన పనులు యాప్‌లో అందుబాటులోకి రాగా ఉపాధి కూలీలకు యాప్ వరంగా మారనుంది.



జన్‌మన్ నరేగా ఈజీఎస్ యాప్

● కూలీ వివరాలు ఉండేలా..

ఉపాధిహామీ కూలీలకు రెండు, మూడు బ్యాంకు ఖాతాలు ఉండడంతో ఏ ఖాతాలో కూలీ జమ అవుతున్నాయో తెలియని పరిస్థితి. వేతనాలు రావడం లేదని కూలీలు కార్యాలయాల చుట్టూ తిరుగుతుంటారు. ఎంత పని చేశారు తెలియదని ఆందోళన చెందుతుంటారు. ఉపాధి హామీ సిబ్బంది రాసిందే పని వచ్చిందే కూలీ అన్న చందంగా ఉండేది. ఎంత పనిచేశారు.. ఏ రోజున పనిచేశారో తెలిసుకునేలా ఈ యాప్‌ను తీర్చిదిద్దారు. దీన్ని ద్వారా కూలీలకు అన్ని వివరాలు పూర్తిగా తెలుసుకునేందుకు ఉపయోగడనుంది. తద్వారా తమకు ఎంత వేతనం వస్తుందో ముందే కూలీలకు తెలుస్తుంది.

● సెల్‌ఫోన్‌లో డౌన్ లోడ్ చేసుకోండి ఇలా..

సెల్‌ఫోన్‌లోని ప్లే స్టోర్లో జన్ మన్ నరేగా అని టైపు చేయగానే యాప్ వివరాలు వస్తాయి. దాన్ని డౌన్లోడ్ చేసుకోవాలి. అందుబాటులో ఆరు రకాల ఆప్షన్‌లు ఉంటాయి. మొదటి ఆప్షన్ నొక్కగానే రాష్ట్రం, జిల్లా, బ్లాక్, పంచాయతీ, గ్రామం, ఫ్యామిలీ ఐడీ వివరాలను సెలెక్ట్ చేసుకోవడంతో పూర్తి వివరాలు వస్తాయి. లేదా కూలీల ఉపాధిహామీ జాబ్ కార్డు నెంబర్ నమోదు చేయగానే కూలీకి సంబంధించిన వివరాలు కనిపిస్తాయి. జాబ్ కార్డులలో కుటుంబ సభ్యుల వివరాలుంటాయి. అటెండెన్స్ ఆప్షన్ ఎంచుకోవడంతో ఏ ఆర్థిక సంవత్సరంలో ఎన్ని రోజులు పనిచేశారు.. ఎన్ని రోజులు పని దినాలు మిగిలిపోయాయి అనే వివరాలు కనిపిస్తాయి. దీంతో ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంకాచేయాల్సిన పనిదినాలు కనిపిస్తాయి. పేమెంట్ ఆప్షన్‌లోకి వెళ్లి వ్యక్తి పేరుమీద క్లిక్ చేయగానే ఎన్ని రోజులు ఎక్కడ పని చేశారు. కూలీ ఎంత ఎప్పుడు వారి ఖాతాలో జమచేశారు. ఏ బ్యాంకులో జమ చేశారని వివరాలు కనిపిస్తాయి. ఉపాధి హామీ డబ్బులు జమ కాకుంటే సదరు లబ్ధిదారుడి ఖాతాకు సంబంధించిన ఆధార్ బ్రిడ్జి పేమెంట్ సిస్టమ్ లింక్ అయిందో లేదో వివరాలు కనిపిస్తాయి. ఒకవేళ లింక్ అయితే పచ్చ రంగులో రైతు గుర్తు ఉంటుంది, లింకు కాకుంటే ఎరుపు రంగును తప్పు గుర్తు ఉంటుంది.

ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపొద్దు: వీసీ



టీయూలో మాట్లాడుతున్న వైస్ చాన్స్‌లర్ యాదగిరిరావు

డిచ్‌పల్లి, మార్చి11 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపొద్దని, మానవదృక్పథంతో సహాయం అందించి నైతిక మద్దతు ఇవ్వాలని టీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొ.యాదగిరి రావు అన్నారు. మంగళవారం రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, ఎన్‌ఎస్‌ఎస్ సెల్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ స్థాయి రెడ్ రిబ్బన్ క్లబ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీసీ యాదగిరిరావు హాజరై మాట్లాడారు. ఎయిడ్స్ గ్రస్తులపై వివక్షత చూపొద్దని, ఆరోగ్యకరమైన జీవనశైలిని బాధ్యత యుతంగా ప్రోత్సహించాలని అన్నారు. ప్రాణంతకరమైన ఈ వ్యాధిపై అవగహన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. మురుగు వాడల్లో నివసించే ప్రజలకు దీనిపై ఎక్కువగా అవగహన కల్పించాలన్నారు. రిజిస్ట్రార్ యాదగిరి మాట్లాడుతూ ప్రభుత్వాలు గతంలో విస్తరించిన క్షయను పూర్తిగా నేడు రూపుమాపాయని, అదే స్ఫూర్తితో ఎయిడ్స్ నిర్మూలనకు ప్రతీఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మామిడాల ప్రవీణ్‌కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త రవీందర్‌రెడ్డి, రాష్ట్ర ఎన్‌ఎస్‌ఎస్ సెల్ కార్యదర్శి నర్సింహగౌడ్, జిల్లా ఎయిడ్స్ ప్రాజెక్టు మేనేజర్ సుధాకర్, ఆరోగ్య ఎడికేటర్ వెంకటేశ్వర్లు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు. ఉపన్యాస, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు వీసీ, రిజిస్ట్రార్‌లు బహుమతులు అందజేశారు.



ఘనంగా ఎల్లమ్మతల్లి బోనాల ఊరేగింపు

డిచ్‌పల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మిట్టపల్లి గ్రామంలో రేణుకా ఎల్లమ్మ తల్లి ఉత్సవాలలో భాగంగా మంగళవారం మహిళలు, పెద్దఎత్తున్న బోనాల ఊరేగింపు నిర్వహించారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాలలో అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేసి తీర్థప్రసాదాలు నైవేధ్యంగా సమర్పించారు. కార్యక్రమంలో గ్రామప్రజలు పాల్గొన్నారు.

వర్సిటీ పేరు మార్చితే మరో ఉద్యమం

● తెలంగాణ వర్సిటీ పేరు మార్పు ప్రతిపాదనలు వెనిక్కి తీసుకోవాలి
● టీయూ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేసిన పీడీఎస్‌యూ, ఎస్‌ఎఫ్‌ఐ



టీయూ కళాశాల ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘు నాయకులు



టీయూ పేరు మార్చవద్దని రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

డిచ్‌పల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీ పేరును మార్చితే ఉద్యమం తప్పదని పీడీఎస్‌యూ జిల్లా ప్రధానకార్యదర్శి డా.కర్క గణేశ్, ఎస్ఎఫ్ఐ వర్సిటీ అధ్యక్షుడు శివ అన్నారు. ఎన్నో ఉద్యమాల ఫలితంగా తెలంగాణ యూనివర్సిటీ సాధించుకున్నమని ప్రభుత్వం పేరు మార్పు ప్రతిపాదనలు వెనిక్కి తీసుకోవాలని డిమాండ్‌చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రం టీయూ రిజిస్ట్రార్ యాదగిరికి అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణరాష్ట్రం పేరుతో ఉన్న యూనివర్సిటీపై రాజకీయలు చేయడం సరికాదని, కావున ఈ విషయంలో ప్రభుత్వం ప్రతిపాదనలు వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో విద్యార్థులు మరో ఉద్యమం చేస్తారని ప్రభుత్వానికి హెచ్చరించారు. దేశంలో చాలా రాష్ట్రాల్లో తమ రాష్ట్రాల పేరుతో యూనివర్సిటీల కొనసాగుతున్నాయన్నారు. అనంతరం పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల నాయకులు సతీశ్, మనోజ్, సంతోశ్, అజయ్ టీయూ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం పాల్గొన్నారు.

● పేరు మార్పునకు నిరసనగా ధర్నా

రాష్ట్రప్రభుత్వం టీయూ పేరు మార్చాలనే నిర్ణయం సరైందని కాదని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి రాజేశ్వర్ డిమాండ్ చేశారు. మంగళవారం వర్సిటీ కళాశాల ఎదుట పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఆందోళన కార్యక్రమంలో ప్రిన్స్, ఉస్సెన్, సాయి, కిరణ్, ఆకాశ్, రమ్య ప్రవీణ, రాజు, లావణ్య, సరిత, నిఖిల్, పాల్గొన్నారు.

భగీరథ నీరు..

వ్యవసాయానికి?

● భగీరథ నీటితో వ్యవసాయం
● నీటి కోసం ముడుపులు
● మంజీర ఉప నది వెంట మంజీరా తాగునీరు
● 50 ఎకరాలకు భగీరథ నీరే సాగు నీరు..
● దొంగతనంగా వాల్వ్ ఓపెన్



మంజీరా ఉప నదిలోనికి వదులుతున్న భగీరథ నీరు



వాల్వ్ ఓపెన్ చేయడంతో మంజీర ఉప నదుల్లోకి పైపు ద్వారా వెళ్లే పైప్‌లు ఇవే..

నిజాంసాగర్, మార్చి11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ తాగునీటి పథకం నీటిని కాదు వ్యవసాయానికి వాడుకుంటున్న భగీరథ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. మిషన్ భగీరథ నిర్వహణ అధికారులు ముడుపులకు ఆశపడి ప్రధానలైన్‌లకు అనుసంధానం ఉన్న వాల్వ్ ద్వారా నీటిని వ్యవసాయానికి వినియోగించుకుంటున్నారు. దీంతో సింగూరు, జుక్కల్ మిషన్ భగీరథ పథకం కింద ఉన్న 785 హ్యాబిటేషన్లలో నీటికొరత ఏర్పడుతున్న అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. సింగూరు, జుక్కల్ మిషన్ భగీరథ పథకం ద్వారా పైప్‌లైన్లు వేసి తాగునీటిని 785 హబిటేషన్లలోని ట్యాంకులకు నీటిని సరఫరా చేస్తుంటారు. నిజాంసాగర్ మండల పరిధిలోని ఎన్‌హెచ్‌ఏఐ 161 రహదారి నాగమడుగు వంతెన పక్కన మిషన్ భగీరథ పైప్‌లను వేశారు. ఈ పైప్‌లైన్లకు ప్రెషర్ వాల్వ్ ఏర్పాటు చేశారు. ఈ ప్రెషర్ వాల్వ్ ద్వారా ప్రతీరోజు అధికా రులు రాత్రివేళలో వాల్వ్‌ను విప్పి వ్యవ సాయానికి వదులుతున్నారు. మిషన్ భగీ రథ అధికారులకు 50 ఎకరాలలో సాగు చేసే రైతుల నుంచి రూ.వెయ్యి నుంచి 2వేల వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. మిషన్‌భగీరథ, సింగూర్, జుక్కల్ ద్వారా బాన్సువాడ, జుక్కల్, ఎల్లారెడ్డి, బోధన్ నియోజకవర్గాల్లో 785 హబిటేషన్లకు తాగునీరు అందిస్తుంది. నాగమడుగు మత్తడి సమీపంలో రాత్రివేళలో రైతులు ప్రెషర్ వాల్వ్ ద్వారా నీటిని ఇప్పి మంజీరా ఉప నదులలోనికి విడుదల చేసుకుంటున్నారు. ఈ నీటి ద్వారా దాదాపు నర్సింగరావుపల్లి, మాగి, వడ్డేపల్లి శివారులోని వ్యవసాయ భూములకు నీటిని వినియోగించుకుంటున్నారు. తరచుగా నల్లవాగు, ముత్తడి నర్సింగ్రావుపల్లి, కూడలిలో పైప్‌లైన్లు లీకేజీలు అవుతున్నామరమ్మతులు చేస్తున్న అధికారయంత్రం ప్రెషర్‌వాల్వ్ ద్వారా లీక్ అవుతున్న నీటిని అరికట్ట లేకపోవడం పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి. వేసవిలో తాగునీటిని దృష్టిలో ఉంచుకుని మిషన్ భగీరథ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణ మహోత్సవం

వేల్పూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడిగెల గ్రామంలో గంగాపుత్ర సంఘం ఆధ్వర్యంలో మంగళవారం శ్రీలక్ష్మీ నర్సింహస్వామి కల్యాణం అంగరంగా వైభవంగా జరిగింది. శ్రీలక్ష్మీ నర్సింహస్వామి దేవాలయ 21వ వార్షికోత్సవం సందర్భంగా బ్రహ్మోత్సవాలు గత మూడు రోజుల నుంచి కొనసాగుతున్నాయి. అందులో భాగంగానే మంగళవారం ఉదయం లక్ష్మీనర్సింహస్వామికి అభిషేకం, వస్త్రాలంకరణ, మండపరాధన, హవనం, గంగజలాల అభిషేకం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం వేద పండితులు రఘురమాచార్యులు, రాజగోపాలచార్యులు, ప్రణావ్‌చార్యుల మంత్రోచ్ఛరణాల మధ్య ఎదుర్కోలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ప్రధానవీధుల గుండా రథోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం భక్త లు శ్రీలక్ష్మీనర్సింహస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చు కున్నారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘ సభ్యులు రాజగంగారాం, బలరాం, గంగామోహన్, చంటి మల్లయ్య, శంకర్, చిన్నరాజన్నతోపాటు మరికొంత మంది సభ్యులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి



సిద్ధరామేశ్వరనగర్‌లో బోనాల ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

ఘనంగా గ్రామ దేవతలకు బోనాలు

భిక్కనూరు, మార్చి 11: మండలంలోని సిద్ధరామేశ్వరనగర్ గ్రామంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామదేవతలకు బోనాల కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు ఇంటికో బోనం తీసి డప్పుచప్పుళ్ల నడుమ గ్రామంలోని ప్రధాన వీధుల గుండా పోతరాజుల విన్యాసాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. ముత్యాలమ్మ, నల్లపోచమ్మ అమ్మవార్లకు నైవేద్యాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భిక్కనూరులో రేషన్ బియ్యం పట్టివేత

భిక్కనూరు, మార్చి 11: మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో అక్రమంగా ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మంగళవారం పట్టుకున్నట్లు భిక్కనూరు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన బూక్య శ్రీనివాస్ రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి వాటిని ఎక్కువ ధరకు విక్రస్తున్నాడని వచ్చిన సమాచారం మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ కిష్టయ్యతో కలిసి తిప్పాపూర్‌లో పట్టుకున్నామన్నారు. ఈ మేరకు అతడి నుంచి 4.83 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని ఆటో సీజ్ చేసి శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



పెద్దకొడప్‌గల్‌లో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న అధికారులు

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

● ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి

భిక్కనూరు, మార్చి 11: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని భిక్కనూరు ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం భిక్కనూరు మండల కేంద్రంలోని బీసీ బాలుర హాస్టల్‌ను ఎంపీడీవో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను, భోజనాన్ని, హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హాస్టల్ ప్రాంగణంలో మొక్కలు ఎండకుండా క్రమం తప్పకుండా నీరు పట్టాలన్నారు. పదవ తరగతి విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

తాడ్వాయి: ప్రభుత్వం ప్రవేశపెట్టిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల ప్రత్యేక అధికారి రాజారాం అన్నారు. ఈయన మండలంలోని కేజీబీవీ గురుకుల పాఠశాలలను మంగళవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పాఠశాలలోని విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా వసతులను కల్పించాలని అధికారులకు సూచించారు. అనంతరం కేజీబీవీపీ హాస్టల్లో రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం కృష్ణాజివాడి గ్రామంలోని ఉపాధిహామీ పనులను పరిశీలించారు. గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలను పెంచే బాధ్యత అధికారులదేనని తెలిపారు. వేసవి కాలం దృష్ట్యా కూలీలకు పనిచేసే చోట అన్ని వసతులు కల్పించాలన్నారు. ఇందులో మండల అభివృద్ధి అధికారి సయ్యద్ సాజిద్ అలీ, ఎంపిఓ సవితారెడ్డి, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు ఉన్నారు.

పెద్ద కొడప్‌గల్: మండలంలోని గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని మండల ప్రత్యేక అధికారి కిషన్ సూచించారు. మంగళవారం గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. వంటగదిని పరిశీలించి వంట చేసే ప్రాంతం శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. దీంతో పాటుగానే విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థినుల కోసం తయారు చేసిన భోజనం పరిశీలించేందుకు వారితోనే కలిసి సహపంక్తి భోజనం చేశారు. పాఠశాలలో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకవస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. రానున్న రోజుల్లో 10వ తరగతి పరీక్షలు ఉన్నందున విద్యార్థులకు పరీక్షలు రాసేందుకు సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దశరథ్, ఎంపీడీవో లక్ష్మీకాంత్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

● ఏఎస్పీ చైతన్యారెడ్డి

భిక్కనూరు, మార్చి 11: భిక్కనూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా అడిషనల్ ఎస్పీ చైతన్యారెడ్డి సూచించారు. మంగళవారం భిక్కనూరు పోలీసుస్టేషన్‌ను నెలవారి తనిఖీల్లో భాగంగా ఏఎస్పీ తనిఖీ చేశారు. అనంతరం ఏఎస్పీ మాట్లాడుతూ మండలంలోని ప్రతీ కల్లు దుకాణంలో తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టాలన్నారు. సైబర్ నేరాల బారిన ప్రజలు పడకుండా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ సంపత్‌కుమార్, ఎస్సై ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మద్నూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆవల్‌గావ్ గ్రామంలో మంగళవారం సీసీ రోడ్డు పనులను నియోజకవర్గం ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ కొండ గంగాధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈజీఎస్ పథకం కింద సీసీ రోడ్డు నిర్మాణానికి జుక్కల్ శాసన సభ్యుడు తోట లక్ష్మీకాంతరావు నిధులు విడుదల చేశారన్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రతీ గ్రామంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు సాయిలు, నాయకులు అముల్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

మండల ప్రత్యేక అధికారిగా రామ్మోహన్

మద్నూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండల ప్రత్యేక అధికారిగా రామ్మోహన్ బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం ఆయనకు ఎంపీడీవో రాణి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఆయన మండలంలోని పలు అభివృద్ధి పనులపై అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఉపాధి హామీ పనులను, నర్సరీలను, అదేవిధంగా కస్తూర్బా గురుకుల పాఠశాలను సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మండలంలో అభివృద్ధిపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అభివృద్ధి చేయాలని సూచించారు. మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల వివరాలు ఏపీవో పద్మను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కస్తూర్బా గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న భోజనం సౌకర్యాల గురించి విద్యార్థులతో మాట్లాడారు. ఆయనతో పాటు ఎంపీడీవో రాణి, ఎంపీవో వెంకట నరసయ్య ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

బీర్కూర్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం

బీర్కూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని లయన్స్ భవనంలో మంగళవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది. కంటి చూపు సమస్యతో బాధపడుతున్న వారు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. వైద్యులు వారికి కంటి పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు, కంటి అద్దాలు పంపిణీ చేశారు. మోతి బిందు ఉన్న వారిని గుర్తించి, శస్త్ర చికిత్స నిమిత్తం బోధన్ లయన్స్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

కామారెడ్డి టౌన్/భిక్కనూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పరిషత్, కోర్టు, జిల్లా గ్రంథాలయ సంస్థలో పని చేస్తున్న మహిళలను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ మహిళ అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా పోటీ పడాలని తెలిపారు. ఉద్యోగులుగా పని చేస్తున్న చోట ఏమైన ఇబ్బందులు ఉంటే పై అధికారులకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

షబ్బీర్‌అలీకి తగిన ప్రాధాన్యం ఇవ్వాలి

కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తూ పార్టీ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్న ప్రభుత్వ సలహాదారు, సీనియర్ నాయకుడు షబ్బీర్‌అలీకి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి తెలిపారు. గత 44 సంవత్సరాలుగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అభివృద్ధి కోసం కృషి చేసిన వ్యక్తికి మంత్రివర్గంలో చోటు ఇవ్వాలని కోరుకుంటున్నానని అన్నారు.

అన్ని రంగాల్లో ముందుండాలి : సబ్ కలెక్టర్ కిరణ్మయి

బాన్సువాడ: మహిళలు, విద్యార్థినులు చదువుతో పాటు సమాజంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ముందుండాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి పేర్కొన్నారు. మంగళవారం బాన్సువాడ నర్సింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి సమాజంలో పోటీ ప్రపంచానికి దీటుగా విద్యార్థినులు, మహిళలు అన్ని రంగాల్లో ముందు ఉండేలా కృషి చేయాలన్నారు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఎంతో అవసరమని, వారి ద్వారానే సమాజంలో ఎలాంటిదైనా సాధించవచ్చు అని ఆమె సూచించారు. మహిళలు ఎలాంటి రంగాన్ని ఎంచుకున్నా ఇష్టపడి కష్టపడి చదివినప్పుడే ఉన్నతమైన స్థానాన్ని పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం

భిక్కనూరు: భిక్కనూరు గ్రామ పంచాయతీలో మహిళా పారిశుద్ధ్య కార్మికులు, భిక్కనూరు పట్టణ అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, ఐకేపీ సిబ్బందిని గ్రామ పంచాయతీ ఈవో మహేష్‌గౌడ్ మంగళవారం శాలువతో సన్మానించి జ్ఞాపికను బహూకరించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, ఆశా వర్కర్లు, పారిశుధ్య కార్మికులు, ఐకేపీ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



మహిళా ఉద్యోగులను సన్మానించిన గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి

ఎల్లారెడ్డి: అంతర్జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ఎల్లారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో పని చేస్తున్న మహిళా ఉద్యోగులకు, పారిశుధ్య కార్మికులకు, మెప్మా సిబ్బందికి మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్ ఆధ్వర్యంలో శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందు ఉండాలని వారికి ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని అన్నారు. మహిళలకు ప్రతి ఒక్కరూ గౌరవం ఇవ్వాలని ఎవరు చిన్నచూపు చూడకూడదన్నారు. పురుషులతో సమానంగా స్త్రీలు సమాజంలో అన్ని రంగాల్లో పని చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ వాసంతి మున్సిపల్ సిబ్బంది వార్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



బాన్సువాడ నర్సింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న సబ్ కలెక్టర్ కిరణ్మయి



భిక్కనూరులో కార్మికులు, అంగన్‌వాడీ సిబ్బందికి సన్మానం



ఎల్లారెడ్డి మున్సిపల్‌లో మహిళలకు సన్మానం

సీఎం మాదిగలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

● ఎమ్మార్పీఎస్ నాయకుడు కత్తి పద్మారావు

కామారెడ్డి టౌన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి శాసనసభలో మాదిగలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు కత్తి పద్మారావు అన్నారు. మంగళవారం కామారెడ్డిలో నిరసనదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టం వచ్చేంత వరకు ఎలాంటి ఉద్యోగ నియామకాలు చేపట్టరాదని గ్రూప్స్‌కు సంబంధించిన ఫలితాలు ప్రకటించడాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఒకవైపు ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టం తెస్తామని ప్రకటిస్తూనే మరోవైపు చట్టం రాకముందే ఉద్యోగ పరీక్ష ఫలితాలు విడుదల చేయడం అంటే మాదిగలకు ద్రోహం చేయడమేనని అన్నారు. చట్టం వచ్చేంత వరకు ఎలాంటి ఉద్యోగ నియామకాలు చేయవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాదగిరి, లక్ష్మీ, సాయిలు, రంగరి సాయిలు, కన్నారం అల్లూరి, శివరాజు, బాగయ్య తదితరులు పాల్గొన్నారు.

షబ్బీర్‌అలీకి తగిన ప్రాధాన్యం ఇవ్వాలి

● కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడెం శ్రీనివాస్‌రెడ్డి

కామారెడ్డి టౌన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీకి కాంగ్రెస్ పార్టీలో తగిన ప్రాధాన్యత కల్పించాలని కామారెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడెం శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కామారెడ్డి నియోజకవర్గంలో ప్రజల ఆశీస్సులతో గెలిచి మంత్రి పదవులు చేపట్టి ప్రతీ కార్యకర్తకు, నాయకులకు అండగా ఉండడమే కాకుండా ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పరంగా ఎనలేని సేవలు అందించాడని వివరించారు. ఎల్లప్పుడు ప్రజా సంక్షేమమే కోరుకోవడంతో పాటు పార్టీని నమ్ముకుని గత 44 ఏళ్లగా కొనసాగడమే కాకుండా పార్టీ అధికారంలో లేనప్పుడు అప్పటి అధికారపార్టీ ఎన్ని ఇబ్బందులకు గురిచేసిన కార్యకర్తలు, నాయకుల్లో మనోధైర్యం నింపుతూ ఇప్పటికీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి బలమైన క్యాడర్‌తో తిరుగులేని నాయకుడిగా ఉన్న మహా నాయకుడని అన్నారు. ప్రస్తుత ఎమ్మెల్సీ స్థానాల్లో ఆయనకు అవకాశం ఇస్తారని ఆశించామని అలాంటిది ఎమ్మెల్సీ రాకపోవడం తమను కలిచి వేస్తుందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌లు సమాలోచనలు చేసి ప్రజానాయకుడైన షబ్బీర్‌అలీకి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని ఏ మాత్రం అవకాశం ఉన్న ఎమ్మెల్సీగా చేసి మంత్రి పదవి ఇచ్చి ఆయన సేవలు వినియోగించుకోవాలని కోరుతున్నామన్నారు.

కాలభైరవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

రామారెడ్డి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండల కేంద్రం - ఇసన్నపల్లి గ్రామాల మధ్య దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న శ్రీ కాలభైరవ స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన పురోహితులు శ్రీనివాస్ శర్మ మంత్రోచ్ఛరణలతో గర్భగుడిలో ప్రత్యేకపూజలు, అభిషేకాలు, సింధూర పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో బుర్ల ప్రభురాంచంద్రం గుప్తా నేతృత్వంలో పలు కార్యక్రమాలను నిర్వహించారు. కామారెడ్డి జిల్లాతో పాటు తదితర జిల్లాల భక్తులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రామారెడ్డి పలు రాజకీయ నాయకులు, వ్యాపారులు, వైద్యులు, ఆలయ జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్, ఆలయ సిబ్బంది నాగరాజు, మహిళలు, యువకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన
మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్

ఎల్లారెడ్డి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండలంలోని హాజీపూర్ తండాకు చెందిన సభావత్ గంగారాం మూడు రోజుల క్రితం గుండె పోటుతో మృతి చెందడంతో విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్సీ ఆల్ ఇండియా బంజారా సేవ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు రాములు నాయక్ మంగళవారం వారి కుటుంబానికి పరామర్శించి మనోధైర్యం కల్పించారు. వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి ధైర్యం చెప్పారు. అనంతరం ఆర్థిక సాయం చేశారు. ఆయన వెంట రాష్ట్ర బంజారా నాయకులు కిషన్ సింగ్, రాందాస్ నాయక్, ప్రతాప్ సింగ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా తదితరులు ఉన్నారు.

పదవ తరగతి విద్యార్థులకు ప్యాడ్‌ల పంపిణీ

రామారెడ్డి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోసానిపేట్, గిద్ద గ్రామాల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రామారెడ్డి మండల మాజీ జడ్పీటీసీ నారెడ్డి మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నారెడ్డి ట్రస్ట్ పరీక్షల సందర్భంగా ప్యాడ్‌లు పంపిణీ చేశారు. సుమారు 70 మంది విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు, పోసానిపేట్ మాజీ సర్పంచ్ మహేందర్‌రెడ్డి, గిద్ద పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కనకయ్య, ఉపాధ్యాయ బృందం, పోసానిపేట్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ఇటుక బట్టీలు
నిర్వహిస్తే చర్యలు తీసుకుంటాం : తహసీల్దార్

పెద్ద కొడప్‌గల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో అనుమతులు లేకుండా ఇటుక బట్టీలు నిర్వహిస్తే తగిన చర్యలు తీసుకుంటామని మండల తహసీల్దార్ దశరథ్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని జగన్నాథ్‌పల్లి శివారులో నిర్వహిస్తున్న ఇటుక బట్టీలను పరిశీలించి నిర్వాహకులతో మాట్లాడారు. ఇటుక బట్టీ నిర్వాహించాలంటే ఆయా శాఖలకు సంబంధించిన అనుమతులు తప్పనిసరిగా ఉండాలని లేదంటే బట్టీలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇటుక బట్టీల నిర్వహణకు అవసరమైన అనుమతులు ఏం ఉన్నాయో వాటిని తనకు చూపించాలని పేర్కొన్నారు. దీంతో పాటుగానే ఇటుక బట్టీల నిర్వహణకు సంబంధించిన పరిమితులను ఎవరూ అతిక్రమించకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు నియమాలు పాటించాలి

పెద్ద కొడప్‌గల్. మార్చి 11 (ఆంధ్రజ్యోతి): 161వ జాతీయ రహదారి గుండా ప్రయాణం చేసే వాహనదారులు నియమాలు పాటించాలని పెద్ద కొడప్‌గల్ ఎస్ఐ మహేందర్ సూచించారు. మంగళవారం తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు రహదారిపై ప్రయాణించే సమయంలో వాహనానికి సంబంధించిన ధ్రువ పత్రాలు తమ వెంట ఉంచుకోవాలని సూచించారు. దీంతో పాటుగానే రహదారిపై తమకు కేటాయించిన వరుసలో ప్రయాణించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడంతో పాటు మద్యం తాగి వాహనాలు నడపరాదని సూచించారు. ఇక వాహనాలపై పెండింగ్ చలాన్లు ఉంటే వాటిని మీసేవ కేంద్రాల్లో చెల్లించుకోవాలని సూచించారు. ఇక భారీ వాహనదారులు రహదారిపై సూచించిన విధంగా వాహనాలు నడపడంతో పాటు గ్రామాల జంక్షన్ల వద్ద జాగ్రత్తగా చూసుకుని డ్రైవింగ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సాయిశివ, రమేష్, శ్రీనివాస్, అంజయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ కార్యాలయం తనిఖీ

ఎల్లారెడ్డి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి ఎక్సైజ్ కార్యాలయాన్ని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. కార్యాలయంలో 2006 నుంచి ఉన్న రికార్డులను, కేసు నమోదు వివరాలను తనిఖీ చేశారు. అనంతరం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల రవాణా, గంజాయి పట్ల ఉక్కు పాదం మోపాలని ఎక్సైజ్ సీఐ షాకీర్ అహ్మద్‌కు సూచించారు. గ్రామాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్టు షాపులపై నిఘా ఉంచాలని తెలిపారు. ఆయనతో పాటు ఎక్సైజ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సీఆర్‌పీల ఎంపిక పరీక్ష

లింగంపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం ఎల్లారెడ్డి, గాంధారి, లింగంపేట, మండలాలకు చెందిన మహిళలకు ఎస్‌వీ.ఈ.పీ. సీఆర్‌పీలుగా పని చేయడానికి రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూలు నిర్వహించారు. మహిళల కోసం స్టార్టప్ విల్లేజ్ ఎంటర్‌ప్రైనెషిప్ ప్రోగ్రామ్(ఎస్‌వీఈపీ)ని కొత్తగా జిల్లాలోని మూడు మండలాల్లో ప్రారంభించినట్లు డీపీఎం రమేష్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమం కింద గ్రామాల్లో కిరాణషాపు, హోటల్, ఇతర కుల వృత్తులు ఆదాయం వచ్చే కార్యక్రమాలు చేయడం చిన్న చిన్న ఎంటర్‌ప్రైజెస్ పెట్టుకోవడం ద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడం అని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు 25 మంది సీఆర్‌పీలను ఎంపిక చేస్తామని ఆయన తెలియజేశారు. లింగంపేటకు 10 మంది, గాంధారికి 10 మంది, ఎల్లారెడ్డికి 5 మందిని సీఆర్‌పీలుగా నియమిస్తామని ఆయన తెలియజేశారు.

జంగంపల్లిలో బెల్టు షాపుపై పోలీసుల దాడులు

● 24 లీటర్ల మద్యం బాటిళ్ల స్వాధీనం

భిక్కనూరు, మార్చి 11: మండలంలోని జంగంపల్లి గ్రామంలో పల్లె దవాఖానా సమీపంలో నిర్వహిస్తున్న బెల్టుషాపుపై భిక్కనూరు పోలీసులు మంగళవారం దాడి చేశారు. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కందునూరి నరేష్‌గౌడ్ పల్లె దవాఖాన సమీపంలో ఎలాంటి అనుమతులు లేకుండా బెల్టుషాపును ఏర్పాటు చేసి విచ్చలవిడిగా మద్యాన్ని విక్రయిస్తున్నాడని వచ్చిన సమాచారం మేరకు బెల్టుషాపుపై దాడి చేశామన్నారు. ఈ సందర్భంగా బెల్టుషాపులో విక్రయించడానికి సిద్ధంగా ఉన్న 24 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని నిర్వాహకుడిపై కేసు నమోదు చేశామన్నారు. మండలంలోని ఎవరైనా బెల్టుషాపులు నిర్వహించిన, దాబాల్లో సిట్టింగులు ఏర్పాటు చేసిన కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తే రూ.50వేల జరిమానా

లింగంపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోమట్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కోమట్‌పల్లి, కేషాయిపేట, అన్నారెడ్డిపల్లి గ్రామాల్లో ఎవరు మద్యం విక్రయించినా రూ.50వేల జరిమాన విధిస్తామని గ్రామస్థులు తీర్మానం చేశారు. గ్రామంలో బెల్టుషాపు నిర్వాహణతో యువత మద్యానికి బానిసలుగా మారి అసాంఘిక కార్యకలాపాలు చేస్తున్నారని, గామంలో కుటుంబాల్లోనూ ప్రతీరోజు ఘర్షనలు జరుగుతున్నాయని గ్రామం ప్రశాంతంగా ఉండాలంటే మద్యం విక్రయాలు పూర్తిగా నిషేధించాలని గ్రామస్థులు తీర్మానించారు. గ్రామంలోని అల్లూరమ్మతో పాటు ఇతర దేవాలయాల వద్ద, చెరువు వద్ద, రోడ్ల వద్ద ఎవరైనా మద్యం తాగితే పోలీసులకు చెప్పి కేసులు చేయిస్తామని వారు హెచ్చరించారు.

కడుపునొప్పి భరించలేక విద్యార్థి ఆత్మహత్య

కామారెడ్డి టౌన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మండలం గర్గుల్ గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థి పల్లపు శరత్‌కుమార్(17) ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ రాజు తెలిపారు. శరత్ స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి చదువుతుండగా మంగళవారం ఎప్పటిలాగే పాఠశాలకు వెళ్లగా తల్లిదండ్రులు మేస్త్రి పనికి వెళ్లారు. శరత్ అక్క మాధురి ఇంటర్ పరీక్షలు రాసేందుకు వెళ్లి తిరిగి మధ్యాహ్నం ఇంటికి రాగా ఇంట్లోని వంటగదిలో శరత్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గమనించింది. దీంతో వెంటనే తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో వారు వచ్చి చూసే సరికి శరత్ మృతి చెంది ఉన్నట్లు తెలిపారు. మృతుడి తండ్రి పల్లపు రాంబాబు తన కొడుకు తీవ్ర కడుపునొప్పితో బాధపడుతుండేవాడని కడుపు నొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడని ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

నాగిరెడ్డిపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బుచ్చమ్మల ఉదయ్ కుమార్ అనే యువకుడిపై మంగళవారం ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్ ఆధ్వర్యంలో పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మల్లారెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికతో బుచ్చమ్మల ఉదయ్ కుమార్‌కు ఏడాది క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. ఈనెల 2న సదరు బాలిక అదృశ్యం కావడంతో బాలిక కుటుంబ సభ్యులు ఈ నెల 3న స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. ఉదయ్ కుమార్ సదరు బాలికను నమ్మించి ఇతర ప్రాంతానికి తీసుకువెళ్లి మాయమాటలు చెప్పి లోబర్చుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు ఉదయ్‌కుమార్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్సై తెలిపారు.

తలమడ్లలో విద్యుత్ షాక్‌తో రైతు మృతి



రామచంద్రం (ఫైల్)

రాజంపేట, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని తలమడ్ల గ్రామంలో మంగళవారం విద్యుత్‌షాక్‌తో రైతు మృతి చెందినట్లు ఎస్ఐ పుష్పరాజ్ తెలిపారు. గ్రామానికి చెందిన పెట్టిగాడి రామచంద్రం(61) ఉదయం గ్రామ శివారులోని తన వ్యవసాయ పొలంలో నీరు పారించడానికి బోర్ స్టార్టర్ వద్దకు వెళ్లి స్టార్ట్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. రామచంద్రం ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెళ్లిచూడగా ఆయన చనిపోయి ఉన్నట్లు గమనించారు. పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని బోరుమోటార్ వైరు తెగిపోయి విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మద్నూర్ టు రుద్రూరు హైవే నిర్మాణానికి నిధుల విడుదల : ఎమ్మెల్యే తోట

మద్నూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మద్నూర్ మండల కేంద్రం నుంచి రుద్రూరు వరకు జాతీయ రహదారి 161 బీటీ నిర్మాణానికి రూ.156 కోట్ల నిధులు విడుదలైనట్లు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు వెల్లడించారు. నిధుల విడుదలకు కృషి చేసిన రాష్ట్ర రహదారుల మంత్రికి కోమటిరెడ్డి, కేంద్ర మంత్రి నితిన్ గడ్కారీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మద్నూర్, రుద్రూరు, బోధన్ - బాసర - భైంసా రహదారిలో భాగంగా మద్నూర్ - రుద్రూరు సెక్షన్ రహదారి నిర్మాణం గతంలో రెండు లైన్లు ప్రతిపాదనలు పంపగా నాలుగు లైన్ల కోసం నిధులు విడుదలైనట్లు వెల్లడించారు.

బాన్సువాడ నూతన డీఎల్పీవోగా సత్యనారాయణరెడ్డి

బాన్సువాడ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): బాన్సువాడ నూతన డీఎల్పీవోగా సత్యనారాయణరెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. బాన్సువాడ ఎంపీవోగా ఉన్న సత్యనారాయణ రెడ్డికి డీఎల్పీవోగా అదనపు బాధ్యతలు జిల్లా కలెక్టర్ అప్పగించారు. ఇంతకు ముందు డీఎల్‌పీవోగా విధులు నిర్వహించిన నాగరాజును బోధన్‌కు బదిలీ చేశారు. డివిజన్ పరిధిలోని అన్ని గ్రామాల పంచాయతీల్లో పారిశుధ్యం, తాగునీరు వంటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపడతామని ఆయన తెలిపారు.

పార్థివ వాహనంలో అటెండర్‌గా పని చేసేందుకు దరఖాస్తు చేసుకోవాలి

కామారెడ్డి టౌన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా ఆసుపత్రిలోని ఉచిత పార్థివ వాహన సేవలో అటెండర్‌గా పని చేయడానికి దరఖాస్తు చేసుకోవాలని ఈఎంఆర్ఐ-హెచ్ఈఆర్ఎఫ్ సంస్థ జిల్లా ప్రోగ్రాం అధికారి తిరుపతి తెలిపారు. ఏడో తరగతి పాస్/ఫెయిల్ అర్హత అని అన్నారు. మార్చి 12,13 తేదీల్లో ఓల్డ్ ఎమ్మార్వో కార్యాలయం పక్కన నిర్వహించే ఇంటర్వ్యూలకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు హాజరు కావాలని తెలిపారు.



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి

దర్శన్ - కింగ్‌స్టన్
ప్రియా 70 - రిటర్న్ ఆఫ్ దా డ్రాగన్
ప్రియా 35 - ఛావా

బాన్సువాడ

మహేశ్వరి - మజాకా
వెంకటేశ్వర - రాక్షస



చికెన్ ధరలు

రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	110	150	180
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

